# టెస్ట్

"శారద అంటే నువ్వేనా?"

"అవునండీ! మీరూ?"

"నేను నారాయణమూర్తి భార్యనిలే. లోపలికి రావచ్చా?" అన్నదామె.

"ఆc..! మీరా! రండి. రండి. నమస్తే అండీ. సడన్‌గా వచ్చారు. ఏదైనా.... ఎవరికైనా ప్రమాదం గాని..."

"నోనో.... ఆయనకేం ప్రమాదం లేదు. మా కెవరికీ ఏమీ ప్రమాదం లేదు గాని అటువంటి దేమైనా వస్తే నీకే వస్తుంది. అది చెప్పడానికే వచ్చా.... మరేం కంగారు పడకు. బెదిరించడం కాదు. నిన్నో సారి చూసి పోదామని వచ్చానంతే.... ఇల్లు బాగానే తీర్చి దిద్దుకుం టున్నావు...కూచో వచ్చా?"

"ఇలా కూచోండి....సారీ అండీ...మిమ్మల్ని గుర్తు పట్ట లేదు. పరిచయం లేదు కదూ?"

"ఎలా ఉంటుందీ పరిచయం? అంత పని ఆయనెందుకు చేస్తాడూ? అందుకే మనమే పరిచయం చేసుకుంటున్నా మన్న మాట. నా పేరు..."

"తెలుసండి ....సుభాషిణి! సుభాషిణి గారు! ఎం.ఎ. చదువుకున్నారు. లిటరేచర్. ఉద్యోగం మీకు ఇష్టం లేదు. అమ్మగారు బాపట్ల. మీ ఫాదర్ ఇన్‌కంటాక్స్ ఆఫీసర్! పెళ్ళయి నాలుగే ళ్ళయింది... పిల్లల్లేరు"

"వెరీ వెరీ గుడ్! అమ్మాయ్ నువ్వు చాలా తెలివైన దానివి. తెలిసింది దాచుకో కుండా చెప్పడం మంచి స్నేహితుల లక్షణం. నువ్వు నాకు చెల్లె ల్లాగా అనిపిస్తున్నావు తెలుసా?" అన్నది.

"థేంక్స్ అండీ! నాకూ అక్కయ్య లెవరూ లేరు. బంధువులూ, ఫ్రెండ్స్ కూడా తక్కువే. ఉద్యోగం పైన ఈ ఊరొచ్చాక చాలా ఇబ్బంది పడ్డాను."

"నువ్వు పని చేసేది మా వారి ఆఫీస్ కాదు....వేరే చోట కదా? మీ కిద్దరికీ పరిచయం ఎలా కలిగింది?"

"మా కొలీగ్స్‌లో ఒకతనికి మూర్తిగారు ఫ్రెండండీ. చాలా కాజువల్‌గా పరిచయ మయ్యారు. అప్పుడప్పుడూ ఇక్కడికి..." అంటూ ఆగింది శారద.

"అప్పుడప్పుడూ ఏమిటిలే! చాలాసార్లు వస్తుంటారు. చాలా హేప్పీగా గడుపుతుంటా రిక్కడ. ఇక్కడికి రావడం మొదలయ్యాక ఇంటికి రావడం లేటవు తోంది. రోజు మార్చి రోజు సెకండ్ షోలు, ఆదివారాలు పిక్నిక్‌లు, పండుగ సెలవుల్లో ఎవరో ఫ్రెండ్స్ వస్తారని చెప్పడం...ఆ కార్యక్రమాలన్నీ ఇక్కడే గడిచి పోతున్నాయి కదూ?"

"అక్కయ్యగారూ!...మీరు..."

"అన్నీ తెలిసే మాట్లాడుతున్నాను. నువ్వేం చిన్న పిల్లవు కావే! ఆయన పెళ్ళయిన వాడని తెలిసీ, లక్షణమైన పెళ్ళాం ఇంట్లో కాచుకుని ఉంటుందని తెలిసీ, ఆయన్ని ఇక్కడ ఎందుకు ఉండ నిస్తావ్ సెకండ్ షోల టైము దాకానూ?.." అన్నది సుభాషిణి.

"అక్కయ్య గారూ! మీరు అపార్థం చేసుకుంటున్నా రండీ! మొదట్నుంచీ నేను వారిస్తూ ఉన్నా...ఆయనే...చనువు తీసుకుంటూ ఇలా రావడం మొదలెట్టారు. ఆయన మంచితనం చూసి వద్దన లేక పోతున్నాను."

"ఆహా! ఆయన మంచి. నువ్వు మహా మంచి. మంచితనం తెలుసు కోవడానికి ఎన్ని గంటలు కావా లేమిటి? మీ మంచితనం ఎంత గొప్పదో నిన్న మొన్నటి దాకా ఆయన ఆఫీసులో చెప్పుకున్నారు. ఇప్పుడు మా వీధి వీధంతా గోల. సుభాషిణి మొగుడు మరో ఇల్లు...చిన్నిల్లు... సెటప్ చేసుకున్నాడని"

"అక్కయ్య గారూ!ప్లీజ్!...అంత మాట అనకండీ....నేను అటువంటి దాన్ని కాను. మా అమ్మ మీద ఒట్టు. దయచేసి నన్ను నమ్మండీ..."

"నమ్మాలనే కదా ఇంత దూరం నీ ఇల్లు వెతుక్కుంటూ వచ్చాను. నేనేం చాదస్తపు ఇల్లాల్ని కాను...పాత కాలపు పతివ్రతనూ కాను....నీ మీద అరిచి గోల చెయ్యడానికి. చూడు శారదా! సరిగ్గా చూసి చెప్పు నాలో లేనిది నీ దగ్గర ఏముంది?"

"అదేంటండీ?"

"కబుర్లు కాదు. మా వారు నీ దగ్గరికి పిచ్చిగా వస్తున్నా రంటే నీలో ఏం విశేషముందో కనుక్కోవాలి కదా! అందుకే వచ్చాను. చూడబోతే నువ్వు చాలా సాదాగా ప్లెయిన్‌గా ఉన్నావు. సినిమాస్టార్ లాగా సెక్సీగా ఉంటా వేమో అనుకున్నాను. అబ్బే... పోనీ...నువ్వే చెప్పు? మనిద్దరిలో సెక్సీ లుక్ ఎవరికుంది?"

"నాకేం లేదండి అటువంటి లుక్"

"నాక్కూడా లేదా?"

"మీరు చాలా అందంగా వున్నారండి. నాకన్నా బాగున్నారు. మీ కలర్ చాలా మంచి మెరుగు కలరండి. బుగ్గమీద పుట్టుమచ్చ కూడా... అచ్చం మూర్తిగారు చెప్పినట్టే ఉంది..." అన్నది శారద.

"ఆహా! అయితే నా విషయాలన్నీ నీకు చెప్తూనే ఉంటా రన్నమాట. మంచి చనువు ఉందన్న మాట మీ మధ్యన" అదోలా అంది సుభాషిణి.

"అబ్బే చనువంటే... బాగా ఫ్రెండ్లీగా..."

"చనువంటే అదేలే. బాగా ఫ్రెండ్లీగా ఉండడమే! చూడూ...నాకంటే నువ్వు ఫ్యాషనబుల్‌గా కనిపిస్తావా?"

"లేదండి. నేను చెప్పడ మెందుకండీ! మూర్తిగారు ఎప్పుడూ చెప్తుంటారు. నాకన్నా, నాలాంటి వాళ్ళు చాలా మంది కన్నా మీరు గ్లామరస్‌గా ఉంటారని"

"మరేం? ఏమిటి నీ స్పెషల్! నీదసలు చాలా చిన్న జాబ్ కదూ. ఎల్‌డీసీ. నెలకు రెండు వేలు మహా అయితే. ఊరు కాని ఊరు. అద్దె ఇంట్లో ఉంటున్నావు. తండ్రి లేడు. తల్లి మంచాన పడుంది. తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ ఆమెను చూసుకో లేక సతమత మవుతున్నారు. నువ్వు పంపే డబ్బు వాళ్ళ కేమాత్రం సరిపోవడం లేదు. నీ కిప్పట్లో పెళ్ళయ్యే మార్గం లేదు. ఎట్లా అవుతాయి నీ లాంటి వాళ్ళకు పెళ్ళిళ్ళు. అమ్మా బాబూ ఉండి అంతో ఇంతో జరుగుబా టున్నవాళ్ళకే కావడం లేదు..."

"ప్లీజ్! నా గుంచి మీరిట్లా ఎందుకు మాట్లాడాలి అసలు? కష్టపడి నా బ్యాక్‌గ్రౌండ్ కనుక్కున్నారు గాని అడిగితే నేనే చెప్పేదాన్ని కదా! ఇంతకూ నా మానాన నే నుండగా మీ వారు నాతో స్నేహంగా ఉన్నారని మీరిలా..." అంటూ ఆగింది శారద.

"మాటలు మీరుతున్నా నంటావా ఏమిటి ? తప్పు...నువ్వే ఆలోచించమ్మా శారదా! నాకేం తక్కువని? ఆయనకేం తక్కువ చేశానని! నీలాంటి వాళ్ళ ఇంట్లో కాలు పెట్టాల్సిన అవసరం ఆయన కేమిటి?"

"అక్కయ్య గారూ! మీరెలా మాట్లాడినా నాకు కోపం రాదు. ఎందుకంటే మీ వైపు నుంచి చూస్తే నాలో చాలా తప్పులు కనిపించ వచ్చు. ఒకటి మాత్రం నిజం. ఆయన ఇక్కడికి ఎందు కొస్తున్నారూ అంటే నాతో ఫ్రెండ్లీగా మాట్లాడ్డానికే... నాకు చదరంగం అంటే చాలా పిచ్చి. మీకు తెలుసుగా ఆయన చాలా బాగా

ఆడతారు. మొదట అందుకోస మనే రావడం మొదలెట్టారు....ఆ తర్వాత పుస్తకాలు. ఆయన ఎన్నెన్ని చదివారు! చదివినవి మరిచిపోక అన్నీ విమర్శిస్తూ, చర్చిస్తూ ఎన్ని గంటలైనా గడిపేస్తారు. పుస్తకాలు మీ ఇంట్లోవే. కానీ.... మీరు.... అసలు చదవ రటగా"

"ఆc!...కాయితాల్లో ఏముంది? పరీక్షలై పోయాక ఇంకా ఏం చదువూ?....పోనీ చదివితే ఏమొస్తుంది? ఎందుకట అసలు? చదివిన దాని ఫలితం... పెళ్ళాంలో ఎటువంటి ఆకర్షణ గాని లేదని తెలుసుకోవడ మేనా"

"అలా ఎందు కనుకుంటా రండీ! ఆయన మీ గురించి చెప్తూ ఎంతో అసహాయంగా బాధపడు తుంటారు"

"నా గురించి నీ దగ్గర బాధ పడతారా? ఎందుకని? ఏమని?" అని అడిగింది సుభాషిణి.

"ఆస్తీ, అంతస్తూ, అందమూ, తెలివీ అన్నీ ఉన్నా జీవితానికి అర్థ మేమిటో తెలుసుకునే ప్రయత్నం చెయ్యరని....జీవితాన్ని ఆనందంగా గడపడం ఎలాగో తెలుసుకోవడం లేదనీ..."

"ఆc!..ఏం మాటలవీ? నాన్సెన్స్ ! మా ఇంట్లో ఎన్ని సోఫాసెట్స్ ఉన్నాయో తెలుసా? మొన్న దీపావళికి డాడీ పంపిన సెట్టు ఐదోది...ఇక్కడ నీ ఇంట్లో పేము కుర్చీలే. టీవీ వీసీఆర్‌లు గొప్పేం కాదు...ఈ మధ్యే వీడియో కెమెరా కూడా కొన్నాను....కాస్త వీధిలోకి రా....నా కారు చూపిస్తాను. కళ్ళు తిరుగుతా యేమో నీకు. మారుతీ జెన్ మెరూన్ కలర్! ఏమిటి జీవితంలో ఆనందమంటే? చూడూ ఈ నెక్లెస్ ఖరీదెంతో తెలుసా? లక్షన్నర! ఇట్లాంటివి పదున్నాయి నా దగ్గర.... ఎందు కట్లా నవ్వుతావు?"

"ఏం లేదు. జీవిత మంటే ఇవే నాండీ"

"ఇంకేంటిట? నీ లాగా ఒంటరిగా వంట చేసుకుని...వండింది కాస్తా స్టీలు డబ్బాలో ఆఫీసుకు పట్టుకెళ్ళి తినడమేనా జీవితంలో ఆనందం?...మా ఇంట్లో నా చేతికి మసి అంటదు. ఎటు చూసినా నౌకర్లు! ఇంకేం కావాలి? ఇంకో మాట చెప్పనా నీకు? నువ్వేమీ అనుకో కూడదు సుమా"

"చెప్పండి ఫరవాలేదు..."

"మావారి కసలు స్టేటస్ అంటే ఏమిటో తెలీదు. ఆయనో కంపెనీకి మేనేజర్ కదా? వేరే కంపెనీ అయినా నీ లాంటి మామూలు క్లర్క్ ఇంటికి రావచ్చా అసలు? పోనీ మా స్టేటస్‌కి తగినట్టు వేరే ఏ లేడీతో అయినా పరిచయం

ఉంటే అది వేరే విషయం..."

"ఓ! అదా మీ బాధ? మీ అంతస్తుకున్న పేరు చెడిపోతుం దనేనా అక్కయ్య గారూ?"

"అంతే కాదు...ఇంకో విషయం...ఆయన గురించి నీ కింకా తెలిసినట్టు లేదు. చదరంగం, పుస్తకాలు, జీవితానందం అంటున్నావు.... ఈ మేధావి పోజు లలా ఉండనీ, నిజానికి ఆయనకో దుర్గుణం ఉంది..."

"దుర్గుణమా! ఏమిటండీ?..."

"నీకెలా చెప్పాలో తెలీడం లేదు. అయినా చెప్పక తప్పదు కదా....నీ లాంటి పెళ్ళి కాని ఆడ పిల్లలతో పరిచయం చేసుకోవడం, స్నేహం చెయ్యడం, ఆ తర్వాత వదిలెయ్యడం ఆయన కో తిక్క హాబీ"

"అదేం హాబీ అండీ? అంత పాడు మనిషిలా అనిపించరు మళ్ళీ?..." అన్నది శారద.

"అదే నీ అమాయకత్వం! ఈ మేధావి ఫోజుల్తో మగ వాళ్ళు ఆడ పిల్లల్ని ఇట్టే బోల్తా కొట్టిం చేస్తారు. మనం జాగ్రత్తగా ఉండాలి..."

" నా జాగ్రత్తలో నే నెప్పుడూ ఉంటాను అక్కయ్య గారూ! నమ్మండి ...ఆయనెప్పుడూ నన్ను టచ్ కూడా చెయ్యరు. నిజం! ప్రామిస్..."

"నిన్ను నమ్ముతాలే... పిచ్చి పిల్లవి. ఏదో చదువు కున్నావ్. ఉద్యోగం కోసం వచ్చావ్. నీకేం తెలుసని? ఈ మగాళ్ళ గురించి నీ కస్సలు ఏమీ తెలిసి నట్టు లేదు. పెళ్ళయిన మగాళ్ళకి కొన్నాళ్ళకి వింత వింత కోరికలు పుట్టు కొస్తాయి. కన్నె పిల్లలు ఇంకా తమ మీద మోజు పడాలనీ, ఎప్పటికీ ఎవర్ గ్రీన్‌గా ఉండాలనీ ఏవేవో ఊహించు కుంటూ ఉంటారు. అయితే వాళ్ళ గురించి అసలు నిజాలు ఎవరికి తెలుస్తాయిలే...నోరు విడిచి అట్లాంటి నిజాలు ఎవరు మాత్రం చెప్పు కుంటారూ..."

" ఫరవా లేదు...చెప్పండి అక్కయ్య గారూ! నేను మళ్ళీ ఎవరి దగ్గరా అనను... ప్రామిస్..." అన్నది శారద.

"బుద్ధిమంతు రాలివి లే....నీ ముఖం చూస్తేనే తెలియడం లేదూ! శారదా! ఇది చాలా పెర్సనల్ మా వారు....బెడ్‌రూమ్‌లో కొంచెం వీక్!..."

"అంటే..."

"పెళ్ళి కాని పిల్లవి...ఏం చెప్పాలి నీకు?...ఆయన పక్క మీద చాలా ఆరాట పడతారు గాని కాస్సేపటికే బలహీనంగా అయిపోతా రన్నమాట...డాక్టర్లని

కన్సల్ట్ చెయ్యడం, అడ్డమైన మందులు వాడడం అన్నీ అయ్యాయి! ఆయన.... అంతే! మరీ సంసారానికే పనికి రాడని కాదు...అర్థమైందా?"

"నా కిదంతా షాకింగ్ గా ఉందండీ! పాపం...మూర్తి గారు.... పాపం...మీరు..."

"ఓహ్! నువ్వేమీ బెంగపడి పోకు. ఆయన అలా డల్ అయిపోవడం, నేను సర్దుకు పోవడం...అదే మా జీవితానందం! ఆ లోపాన్ని కాస్త సర్ది పుచ్చు కోవడానికి...నన్ను మోసం చేస్తూ తనని తాను మోసం చేసుకుంటూ నీ ఇంట కాలక్షేపానికి వస్తున్నా రన్నమాట! అర్థమైందా? అంతే! ఏదో ఆశ పెట్టి నిన్ను మోసం చేస్తున్నట్టే కదా?" అన్నది సుభాషిణి.

"ఆయనేం ఆశ పెట్ట లేదండీ! నే నేమీ ఆశ పడ లేదు"

"వట్టి కబు ర్లెందుకు శారదా! ఆడా మగా కొద్ది రోజులు కలిసి గడపడం అలవా టైతే ఆశలు పుట్టడం సహజం. అదేమీ తప్పుకాదు. కానీ ఇంట్లో భార్య ఆశలే తీర్చ లేని వాడు..." సగంలో ఆపేసింది.

"సారీ అక్కయ్య గారూ!...ఇంకేమీ చెప్పకండి. నేను వినలేను ప్లీజ్..." అన్నది శారద.

"అయితే నే వచ్చిన పని అయినట్టే నన్న మాట. చెప్పా లనిపించిం దంతా చెప్పేశాను. ఇక కథ అంతా నీ చేతుల్లో వుంది. నీ ఇష్టం. మరి వెళ్ళి రానా?"

"వెళ్ళి రండి అక్కయ్య గారూ"

"శారదా!...ఏంటిది? ఎప్పుడూ లేనిది ఇలా పైన పడతా వేంటి? వద్దు.... వదులు చెప్తా...."

"ఏంటి చెప్తారు? ఇంత సేపూ ఇక్కడిలా కూచుని నవ్వుకుం టున్నారా? ఎంత గొప్ప మనిషి మీ ఆవిడ! మీ రేదో చెప్తే అయ్యో పాపం అనుకున్నాను...కనీసం చదరంగంలో ఒక పీస్‌ను టచ్ చేసిన ట్టయినా టచ్ చెయ్య లేదు నన్ను మీ రెప్పుడూ! ఆవిడ ఎంతెంత మాట లంది మీ గురించి..."

"చెప్పానుగా...అదీ ఆవిడ ధోరణి. చూడూ! నువ్వు తాకుతుంటే ఎప్పుడూ లేనిది నాకు ఏదోలా ఉంది. ప్లీజ్ వద్దు..." అన్నాడు బ్రతిమాలు తున్నట్టుగా.

"నేనూ అలాగే అనుకున్నా ఇన్ని రోజులూ! కాని...చివరగా...బెడ్‌రూం

గురించి ఆవిడ అన్న మాట"

"అసూయతో అంది అంతే!...నువ్వు దూరం జరుగూ...." అన్నాడు నారాయణ మూర్తి.

"అదే! ఆ మాటలో ఎంత నిజముందో నేను తెల్సుకోవాలి. కాదన కండి..... ప్లీజ్!..."

06.12.1996 సంచిక